# బతుకు వల

— చైతన్య ప్రకాశ్



ఇంకా తెలవారలేదు. నర్సయ్య నిద్ర లేచి ఎక్కడికో బయలుదేరడానికి సిద్ధమవుతున్నాడు. ఇంతలో అతని భార్య రాజవ్వ కూడా లేచి...

"ఏమాయె... ? ఖళ్ళవోతున్నవా ? ఏం జెప్పవేంది ? ఏమన్న దొర్కెటట్టున్నయా లేదా ?" అని అడిగింది.

"స్స్... పిస్సముండ... సప్పుడ్జేకు... మాదొర్కుతయి గని..." అన్నాడు నర్సయ్య.

"మరి పైలంగవో ! సీకటి పూట" అని హెచ్చరించింది రాజవ్వ. హడావుడిగా సత్తయ్య ఇంటికెళ్ళాడు నర్సయ్య. ఇద్దరూ సరంజామా సర్దుకున్నారు. సైకిల్ క్యారియర్లకు తగిలించుకుని బయల్దేరారు. వాహనాలు ఎదురొచ్చినప్పుడు తప్ప రోడ్డు మసక మసకగా కనబడ్తోంది.

పెద్దూరు, జగ్గరావుపల్లి, సర్దాపూర్ దాటి 'పదిర' బ్రిడ్జి దగ్గరకు చేరుకున్నారు. అక్కడ ఆగి గుసగుసగా మాట్లాడుకున్నారు. ఊర్లోకి పోయి... గుర్తున్న వాళ్ళ దగ్గర సైకిళ్ళు పెట్టారు.

భుజాల మీద సరంజామా సర్దుకొని వాగులోకి దిగారు. చీకట్లో తీతువుపిట్ట అదే పనిగా అరుస్తున్నది. నడుస్తున్నప్పుడు గుంతలు పడ్తూ ఇసుక చప్పుడు. విశాలమైన మానేటి వాగులో ఒక్క నీటి చుక్క లేదు.

నర్సయ్య జ్ఞాపకాల్లోకి జారుకున్నాడు.

రెండు రోజుల నుండి తిండి సహిస్తలేదు. కంటికి నిద్రలేదు. "ఈరంది ఎప్పుడు వోతదో... మారె... జిందగి వోతనె గని..." అనుకున్నాడు.

"ఏమాయెనె సప్పుడ్జెయ్యవు?" సత్తయ్య మౌనాన్ని బద్దలుజేయాలనుకున్నాడు.

"ఏయ్... ! సప్పుడ్జెయ్యకురా !..." నర్సయ్య ఎవరికీ అలికిడి విన్పించకూడదనే ఉద్దేశంతో అన్నాడు. వాళ్ళిద్దరూ నడుస్తూ ఉన్నారు.

నర్సయ్య మళ్ళీ గతంలోకి జారుకున్నాడు.

"నా కొడుకు పుట్టుకనే కట్టం పుట్టుక!" ఎన్నేండ్లదో అవ్వ మాట అప్పుడప్పుడు మెదడులో తిరుగుతుంది....

నర్సయ్యకు మేనమామ బిడ్డ రాజవ్వతో తన ఇరువయ్యో ఏట పెళ్ళయ్యింది. అప్పుడు ఏడవ తరగతి చదువగానే ఆగిపోవాల్సి వచ్చింది. తండ్రితో పాటు రాత్రనక పగలనక షికారుకెళ్ళి ఊళ్ళో ఎక్కువోళ్ళ ఇళ్ళ చుట్టూ తిరిగి అమ్మేవాడు.

తర్వాత సైకిలు కొనుక్కుని రోజూ మండేపల్లి నుండి తాలూకా కొచ్చి అమ్మేవాడు.

ఇంకా కొన్ని సంగతులు మతికి రాక కణతలు రుద్దుకున్నాడు, నర్సయ్య.

ఒక్క కొడుకని 'చెటాన' దెబ్బ ఎయ్యకుండా సాదుకొచ్చిన అవ్వ ఎప్పుడూ గుర్తుకొస్తూ ఉంది. చుట్టలు తాగి తాగి క్యాన్సర్‌తో తండ్రి చనిపోయాడు. దాంతో అవ్వ మంచంపట్టింది. తన పెద్ద కొడుకు పుట్టింతర్వాత తల్లీ పోయింది.

చెరువులూ, కుంటలూ కరవుకు నెర్రెలు బారాయి. బతుకు కష్టమయిపోయింది. చిన్నోడు పుట్టింతర్వాత తాలూకా టౌన్‌కి మకాం మార్చాడు. ఊర్లోని ఇల్లును అమ్మేసి టౌన్లో జాగా కొన్నాడు. సాగు భూమిని అమ్మేసి చిన్న చిన్న రూములు కట్టుకున్నాడు. కిరాయికి ఇచ్చుకున్నాడు.

తర్వాత గంగ పుట్టింది. తనలాగే చిన్నప్పటి నుంచి రోగాల కుప్ప.

చిన్న చిన్న వ్యాపారాల్లోకి దిగి అనేక వ్యాపార మర్మాలు తెల్సుకున్నాడు. కొన్నాళ్ళు బట్టలబేరం, తోపుడు బండిలో అరటి పళ్ళు అమ్మడం, సైకిల్ టాక్సీ, పాన్ కోకా, కొన్నాళ్ళు పవర్ లూమ్స్ నడిపించాడు. నేత బట్టలకు రంగులద్దాడు. మరి కొన్నాళ్ళు హోటల్ నడిపాడు. తను బతికిన తీరు బొంతకు కుట్టిన దారంలా అనేక వృత్తుల్లోకి జొరబడ్తూ బయటికొచ్చింది.

అయినా... 'ఎప్పటి శిప్ప ఎనుగుల్లే!' పొగ సూరే మందమే మిగిలింది. మరికొంత అదనంగా కష్టపడ్డ దానితో ఇద్దరు కొడుకుల్ని కాలేజీ వరకూ చదివించాడు. పెద్దోడు ఎల్లైసీలో అటెండర్‌గా, చిన్నోడు సినిమా ఆపరేటర్‌గా పని కుదుర్చుకున్నారు.... ఏదో తోచినంత మందం... నల్గురిలో నామోషీ లేకుండా చిన్న పైస అప్పుల్లేకుండా రెండు పెళ్ళిళ్ళు చేశాడు. దూరపు బంధువు పిల్లవానికి గారాబంగా పెంచిన తన కూతురు గంగను ఇచ్చి పెండ్లి చేశాడు. దాంతో ఏకాస్తో దాచుకున్న డబ్బు హరీమన్నది.

అల్లుడు హైద్రాబాద్‌లో సినిమా పోస్టర్లతికించే పనిలో ఉన్నాడు.

ఇద్దరు కొడుకులకు ముగ్గురేసి పిల్లలయింతర్వాత ఎవరి సంపాదన వారు, ఎవరి 'కాయం' తో వాళ్ళు వేరు కాపురాలు చేస్తూ ఇల్లే మార్చారు.

భళ్ళున చప్పుడయి నర్సయ్య ఈ లోకంలోకి వచ్చాడు.

గాలికి తాడి చెట్టుకు ఎండిన కమ్మమట్ట "బర్క్

"బర్క్" గిరి గిరి తుపుక్కున కిందపడింది. కాసేపు తన జ్ఞాపకాల ధార తెగిపోయింది. తాడి చెట్లూ, ఈత చెట్ల మధ్యలోంచి దుబ్బుల్లో పిల్లబాటను కాదని నడుస్తున్నారు. పల్లేరు కాయలు గుచ్చుకుంటున్నాయి. వాటి కవే రాలిపోతున్నాయి. సత్తయ్య నర్సయ్యను మౌనంగా అనుసరిస్తున్నాడు.

నర్సయ్య మరోసారి గతంలోకి జారుకున్నాడు.

ఊహించని పరిణామంగా ఆక్సిడెంట్‌లో భర్తను కోల్పోయిన గంగ ఇంటికొచ్చి మంచంపట్టి జబ్బుపాలైంది. ఆకలి మందగించింది. దగ్గు మొదలైంది. డాక్టర్‌కు చూపిస్తే టి. బి. అన్నారు. అయినా... పొద్దుటి పూట రెండు మూడిండ్లలో పాచిపని చేస్తున్నది. కొన్ని మందులు కొనిచ్చిన కొడుకులు, వంతుల వారి బియ్యం సరిపెట్టడంతోనే చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పుడు అవీ మానుకున్నారు. అడిగితే "మాకే ఎల్లుతలేదు. దినందినం దంద పెద్దగయితుందా చిన్నగయితుందా ? మమ్ములనేం జేయమంటవ్ ?" గుర్రుమంటున్నారు.

తనను కన్న తల్లిదండ్రుల ఆత్మ బలమే తననిందాక బతికించుకొస్తున్నది. చివరికిప్పుడు తన తల్లి దండ్రి సంపాదించిన ఆస్తి అమ్మి కట్టుకున్న రూములే తనపాలిటి వరమయ్యాయి. కిరాయి డబ్బే పెద్ద దిక్కుగా మిగిలింది. ఇప్పటికీ తన తల్లితండ్రులు తనను పోషిస్తున్నట్టే లెక్క.

పక్కన గుంపులోకి కుందేలు దూకిన చప్పుడు నర్సయ్య ఆలోచన్ల నుంచి తేరుకున్నాడు.

ఇద్దరూ దుబ్బలు దాటి పొలం ఒడ్డు ఎక్కారు.

"ఎట్లయితే అట్లయితది నశీవ !" అనుకున్నాడు నర్సయ్య.

ఒడ్డు మీంచి కాలుజారింది నర్సయ్యకు.

"ఏందే ఏమైందీ !" బ్యాటరీ వెలిగించి ఆతృతగా అడిగాడు సత్తయ్య.

"లైట్ బంజెయ్ ! లైట్ బంజెయ్ !" గుసగుస స్వరంతో కాస్త గట్టిగానే అన్నాడు నర్సయ్య.

సత్తయ్యకు బీడీ తాగాలనిపిస్తుంది. నర్సయ్య ఏమంటాడోనని ఆ కోరికను అణచుకున్నాడు.

నర్సయ్య మళ్ళీ ఆలోచన్లోపడ్డాడు.

"నాతోటే టౌన్‌కొచ్చిన ఈ సత్తిగాడు ఎంతమేలయిపోయిండు, ఆని కొడుకులు ఇప్పటిగ్గూడా గజ్జుమంటరు. ఎంత మంచిగ జూసుకుంటరు. ఈడు సాటు సాటుకు సంపాంచుకున్న పైసల్తోటి ఆటో కొనుక్కొని డ్రైవరు పోరన్ని పెట్టుకున్నడు. ఈనికేం తక్కువ, ఈని కొడుకులు గూడా ఎంత ఇగురవంతులు... మూరె, నా అదురుష్టమే మంచిగలేదు. మొఖం మంచిగ లేక అద్దం వారెత్తే ఏమత్తది !" అని నోరు చప్పరించుకున్నాడు.

దారంలా వాలుగా సాగిలబడ్డ పిల్లబాట నుంచి చెరువుకట్ట ఎక్కారు. ఒక పిట్ట విచిత్రంగా అరుస్తోంది. చెరువులో వాటం కోసం చూస్తున్నారు.

"నర్మాల వాక్కు అడ్డం కాలువ కట్టిండ్రు, లేకపోతే గింతగనం నీళ్ళుండునా ?" తనలో తను అనుకున్నాడు. ఆ క్షణంలో ఎప్పటి గతమో తారాడింది.

"మోటల్ పోయినయ్, ఇంజన్ల మోటార్లు పోయినయ్ ! యాతాలు పోయినయ్, మొత్తంమ్మీద బాయి తవ్వే అలవాటే లేకుంటయ్యింది. బోర్లు... మొత్తం బోర్లే జల్లెడ తూట్ల లెక్క భూమితల్లి పెయ్యన్ని తూట్లే!" తనలో తానే చిన్నగా గొణుక్కున్నాడు.

తానెప్పుడో చిన్నప్పుడు... ఎవరిదో పెండ్లికొచ్చి ఈ చెరువులోనే ఈదులాడాడు.

దూరంగా నక్కలు ఊళపెడుతున్నాయి.

కొండాపురం ఊర్లోని ట్యూబ్‌లైట్లు తెల్లగా పొడుగ్గా వేలాడదీసినట్లు కాంతితో మెరుస్తున్నాయి.

కట్ట మీద నిలబడి సత్తయ్య గోచి బిగించుకుని అటిటు చూస్తున్నాడు.


నర్సయ్య కూడా గట్టిగా గోచీ బిగించాడు. చెరువులోకి వంగిన ఈత కమ్మల్ని పట్టుకుని చెర్లోకి దిగాడు. కాలితో తుంగ మొదళ్ళకు తూటి తీగల్ని అదిమిపట్టాడు. బుడుగ్గున రెండు పెద్ద చేపలు దుమికాయి. నాచు వాసన, కప్పసు వాసన... ఉత్సాహంగా ఉంది. చిన్నప్పుడు అవ్వ తన నాభి మీద నోరుపెట్టి "ఊఁ" అని ఊదినట్లు ఉంది. మరొక పెద్ద చేప పిక్కల్ని తాకుతూ ఉరికింది. కాలు పట్టు తప్పి బెణికినట్టయ్యింది. చెట్ల మీదున్న గుడ్డి కొంగలు ఒక్క సారిగా ఉలిక్కిపడి "కేర్ కేర్" మంటూ ఆకాశంలోకి లేచాయి.

మెల్లి మెల్లిగా భుజాల వరకు నీళ్ళలోకి దిగాడు నర్సయ్య.

నిన్న ఈ చెర్లో చూసిన చేపలు గుర్తొచ్చాయి. కొడిపెలు, పాపెర్లు, మొట్టలు, కొర్రమీనలు, మార్పులు, ఎర్రాయిలు, బొచ్చెలు, పరకలు, చందమామలు, ఉలిపెలు, వాలెగాళ్ళు, జెళ్ళలు, ఇంగ్లీకలు, పూల్‌మారలు, ఆలుగులు, చెప్పుతట్టలు, బుగ్గజామలు, మంగిలి పరకలు, మీసగొడిపెలు, ఎర్ర పరకలు, నాయిన కొంతాలు, మలుగుపాపెర్లు, శీకు మొట్టలు, రొయ్యలు, నత్తినీలు, కనుగులు, మొయ్యలు, ఇర్నపు చేపలు, జీర వరలు, పంది పర్కలు, బొమ్మిడీలు, గంగరొయ్యలు, మాల పంకిరిగాళ్ళు, బంద పాకురుగాళ్ళు... ఎన్ని చేపలో...?" ముందుగాల జూసి సత్తయ్యను తోలుకచ్చుకున్నందుకు... ఆనికంటే ఒక్కపాలు ఎక్కువ తీసుకోవాలె!" అనుకున్నాడు నర్సయ్య.

భుజం మీద కచ్చుడు వల తీసి ఈకొసకట్టి నడిచెర్లోకి పోయాడు.

"ఎట్లనన్న మందుల మందమన్న సంపాయించాలె... రేపన్నా మందులుగొనాలె... బిడ్డా ! ఎట్లున్న శెత్త ఎట్లయిపోతున్నది. దినం దినం బిడ్డ బొక్కనోలె... అయ్యో... నా బిడ్డ గంగా... నా బతుకు నీ బతుకు ఒకటే కట్టం పుటుక... రాత మంచిగ అడుక్కొచ్చుకోలె బిడ్డా... ఎంతపనయిపాయె బిడ్డా ! ... కనుడు నావంతయ్యిందిగాని... నీ కట్టం సుఖం నా వంతయితలేదు బిడ్డా ! ఇగ నా బతుకయిపోవట్టె... నా కండ్ల ముందే నువ్వు గిట్లగావడ్తివి. మాయమ్మ గంగమ్మని నీ పేరు పెట్టుకుంటే గంగల వడ్డట్టాయె నీ బతుకు..." ఈడు



## డేట్లు తెచ్చిన తంటా !



బాలీవుడ్ నిర్మాత ఫిరోజ్ నడియాడ్ వాలా, తన చిత్రం 'హేరా ఫేరీ' లో ఓ డాన్సు చేయమని రవీనా టాండన్‌ను అడిగితే ఒప్పుకుంది. గత జనవరిలో మధ్య వారానికి అయిదు రోజుల డేట్లిచ్చింది. కానీ కాలి ఎముక చిట్లడంతో ఆమె పూర్తి చేయలేకపోయింది. ఫిరోజ్ "మీ ముఖం చూడనిక! నీకే నష్టం!" అని అరిచి కొప్పడ్డాడని చూసినవారంటున్నారు. రవీనాకూ చేయాలనే ఉంది. ఫిరోజ్ ఆమెతో తప్ప మరో నటితో ఆ డాన్సు చేయించనంటున్నాడు. కారణం రవీనా తమ ఫ్రెండ్ కాబట్టి అని అంటున్నాడు. వరుసగా మామూలు స్టేజీ షోలతో చాలా బిజీగా ఉంది రవీనా ఈ ఏడాది జూన్ దాకా. ఒక్క మూడు రోజుల షూటింగుతో పూర్తవుతుంది. మార్చిలో చిత్రం విడుదల చేయాలని నిర్మాతల పట్టుదల. చూద్దాం. ఏమవుతుందో !

కుంటూ ఈదుకుంటూ చివరికి చేరుకున్నాడు. అటువైపు ఈతచెట్టు కమ్మలను పలగట్టిగకట్టాడు.

చల్లటి నీటిలో మెల్లిగా ఈదుకుంటూ చప్పుడు వినపడకుండా ఇటువైపు వస్తున్నాడు.

తల మాత్రమే కనపడుతోంది.

చెరువు కట్ట మీంచి రెండు బ్యాటరీల వెలుగు చెర్లోకి వస్తోంది.

నర్సయ్యకు ఒక్కసారిగా భయం ఆవహించింది.

త్వరగా ఒడ్డు చేరుకోవడానికిగాను చప్పుడు గాకుండా నీళ్ళ లోపలే కాళ్ళూ చేతులూ ఊపుతూ ఈదుతున్నాడు.

మళ్ళీ దగ్గర్లోనే బ్యాటరీ వెలిగింది.

వేగంగా ఒడ్డుకి నెట్టుకొస్తున్నాడు.

కొంతదూరం నుంచి సరాసరి తన తలపై బ్యాటరీ ఫోకసయ్యింది.

"దొంగల్రో...దొంగల్రో!" పెద్దపెట్టున అరుచుకుంటూ తనవైపు పరుగెడుతూ వస్తున్నారు. వాళ్లు తన దాకా చేరకముందే కట్టఎక్కి నర్సయ్య పరుగెడుతున్నాడు.

వాళ్లూ వెంబడిస్తూ పరుగెత్తుకొస్తున్నారు.

'కట్ట' వాలుదిగి స్పీడుగా ఏటో దుముకబోయాడు. చీకట్లో మర్రిచెట్టు కనబడలేదు.

కంటి ఎముకకు తగిలి "అవ్వా!" అంటూ పెద్దపెట్టున అరిచి కిందపడ్డాడు.

వాళ్లు అరుస్తూ ఇంకా వెంబడిస్తున్నారు.

మళ్లీ లేచి...పక్కనుంచి ఏదో అడ్డొచ్చి దానిమీంచి అమాంతం దుముకబోయాడు.

అది గుజ్జుకోసం కొత్తగా నరికేసిన ఈతమొదలు.

పొట్టకూ తొడలకు మర్మావయాన్ని ఒరుసుకుంటూ ఈతముళ్లు.

మరోసారి "అవ్వా!" అన్నాడు...కళ్లు చెమ్మగిల్లాయి. పైకిలేచి...ఈతమొదలు మీంచి తలకిందులుగా బండమీద పడ్డాడు.

బలంగా తలకు తగిలి స్తబ్దుగా కదలకుండా పడిపోయాడు.

బ్యాటరీలు వేస్తూ ఆవేశంగా వచ్చిన ఇద్దరూ ఏమి గమనించకుండానే చేతులున్న బడ్తెలతో బాదారు. నడుమ్మీద, పిక్కలమీద బలంగా తగిలాయి.

"ఒవ్వో!" భయంకరంగా అరిచాడు.

"అవ్వా...వ్వా...వ్వా... మీకు దండం బెడ్తనే... బాంచెనే... కాల్మొక్కుతనే... అవ్వో...నేం బతుకనే..." అంటూ హృదయవిదారకంగా... చేతిని ఒకడి కాళ్లమీద వేసి ఎగపోస్తూ బతిమాలుతున్నాడు.

ఆఇద్దరూ కోపంగా బ్యాటరీలైటు వేసి చూశారు. ఎవరైందీ అర్థం కాలేదు.


కోపం చల్లారలేదు.

"ఇన్ని రోజులనుంచి సూడంగ ఇయ్యాల్ల దొర్కినవురా!" అంటూ ఒకడు తన్నాడు.

నర్సయ్య కదలలేదు, మాటలేదు, ఎగపోత మాత్రమే.

పరిశీలనగా చూశారు.

## మేకప్ మహిమే ఇది !



బాలీవుడ్ మేకప్ ఆర్టిస్టు జయవంత్ ఠాక్రే మేకప్ మెలకువలను గురించి తారామణులెందరికో చెబుతున్నాడు. "బట్ట లెలాంటివి వేసుకున్నా మేకప్‌లో వెండి, బూడిద రంగులకున్న డిమాండును బట్టి అందరూ వాటినే వాడుకుంటున్నారు. ఒకప్పుడు చాల తక్కువ మందికి మాత్రమే తెలుసు దీన్ని గురుంచి నేటి కొత్త వారికి లేటెస్ట్ మేకప్ తెలుసు. కరిష్మాకపూర్, ఊర్మిళా, మనీషా కొయిరాలాకు తమకేం సూట్ అవుతుందో, తామెలా బాగా కనపడతారో బాగా తెలుసు. వాళ్ళు పెర్ఫెక్షనిస్టులు. నిర్మాతలు కూడా మంచి మేకప్‌ను గురుంచి ఆరా తీస్తున్నారు. మునుపు ఫారిన్ మేకప్ మనవారితో చాలా మందికి పడేదికాదు. ప్రస్తుతం జర్మన్ మేకప్ అందరికీ బావుంటుంది. అంతెందుకు మామూలు గృహిణి కూడా పార్టీయో, పెళ్ళో ఉంటే బ్యూటీ పార్లర్‌కి వెళుతుంది కదా" అంటున్నారు కాల మహిమ కదా.

నడుమూ మోకాలు బొక్క విరిగింది. కంటిబొక్క నుంచీ తలనుంచి రక్తం కారుతోంది.

కొంత దయదలిచి, రేపు పదిమందిలో పెట్టాలని దొప్పలో నీళ్లుతెచ్చి తాగించారు.

నడుముదగ్గర ఒకరూ తలదగ్గర ఒకరూ పట్టుకొని మాదిగిండ్ల దాకా తీసుకొచ్చి లైటువెలుగులో కింద దించారు.

మొత్తం రక్తం ముద్దలా ఆకారం

ఎక్కడబడ్తే అక్కడ ముళ్లు చర్మం గాట్లు.

రక్తం...రక్తం...రక్తం!

"ఎవ్వలు? వీళ్ళెవలు?"

తెల్లారి మెలుకువై చూసుకుంటే తనకేమయిందీ తెలియదు. ఒళ్లంతా కట్లు...నొప్పులు...చుట్టూ కొత్తముఖాలు... కుమ్మరిగూనెమూరు, అందుగు చెట్టునీడ, కొత్త కొత్త గొంతులు, రకరకాల మాటలు. పక్కన తను తెచ్చుకున్న కచ్చుడు వల, రెండు సంచులు.

ఒకరు ఏదో తీసుకొచ్చి తాగమన్నారు.

"ఏ వూర్రా? మీది?" బెదురగొడ్తూ ఒకడు అడుగుతున్నాడు.

"అరెరే...ఏందొంగలు... ఎక్కడెక్కడ్నుంచో అత్తుండ్రు. తెల్లందాక చెరువంత లూటి జేత్తుండ్రు" ఒక బెస్తాయన అన్నాడు.

"మరిగిట్లనే గొట్టుకుంటరా?" ఒక యువకుడు అడుగుతున్నాడు.

"పో! పోవయా! మంచిగున్నవ్ నువు. పొరుగూరోనికి సైడిత్తవ్!" మరో బెస్తాయన అదరగొట్టాడు.

"చెరువు మీ జాగీరనుకున్నారా?" మరొకాయన అంటున్నాడు.

"పట్నం నుంచి తెచ్చి శాపల ఇత్తునం బోసింది గిసోంటోళ్ళకోసమేనా?" కులపెద్ద అడుగుతున్నాడు.

"ఇత్తునం బోసిండ్రు నియ్యమేగని... అండ్ల నీ అయ్య బోసిండా నీళ్ళు... ఊరందరం గలిసి కాలువ గండ్లు పోసుకుంట మేం నింపితే శాపల తేమిడి జేస్కుంట ఏషాలేత్తుండ్రు... అన్ని గొట్టెతందుకు మీదేం తుర్రు?" ఒక రైతు బెట్టుకు దిగాడు.

'ఎవ్వల్ది తప్పో...పోలీసు కంప్లైంటిత్తే తెలుత్తది!" మరొకడు.

"ఎట్లయితే గట్లయితది గని... ముందుగాల ఈన్ని మంచిగజెయ్యాలె... అసలేవూరో అడుగుండ్రి!"

"ఈనోటి ఉంకొగడు గూడా అచ్చిండట... రాత్రికి రాత్రే పారిపోయిండట" ఎవరో అంటున్నారు.

మరెవరో నీళ్ళు తాగిస్తున్నారు.

పుట్టినూరు తనకుగాలేదు. బతుకపోయిన టౌనూ సరిగ్గా బతుకనియ్యలేదు. స్వంత కొడుకులే... తనకు...దూరంగా...

"అవ్వా...! గంగవ్వా! ఎట్లున్నవ్ బిడ్డా...! ఇగో... నీ కోసం... మనసొంటి కులమ్మనుసులే, నేను పుట్టిన ఊర సొంటివూరే... కన్నతల్లి అసొంటి చెరువే... నన్ను గుండె చెరుపుతుంది... నన్ను కాటగలుపుతుంది. కడుపుతీపి నన్ను దొంగను చేసింది. మాంసపుముద్దను చేసింది. నీ పాణాన్ని గాసాడేతందుకు చేపలకు వలలేసి దొంగతనం చేశైనా సాదుకుంట అనుకున్నా! నేనే వలల చిక్కుకొని విల...విల.. అవ్వా!... గంగవ్వా! బిడ్డా! వశమయితలేదు బిడ్డా! వశమయితలేదు" లోలోపల కుములుతున్నాడు.

"ఏవూరు మీది?" ఒక గొంతు గద్దిస్తున్నట్టు. ఎగపోత కష్టంగా ఉంది. స్వరం పెకులుత లేదు.

అతికష్టంగా నొప్పులతో తండ్లాడుతూ

"సిరిసిల్లా!" అన్నాడు.

కళ్లవెంట నీళ్ళు, కట్లనుంచి రక్తం కారుతూ బిడ్డ గంగనూ భార్యనూ సత్తిగాని... పేర్లను నర్సయ్య కలువరిస్తూ మగతలోకి జారుకున్నాడు.